ప్రజా సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే సబితారెడ్డి

- పేద మహిళకు చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందిస్తున్న సబితారెడ్డి తదితరులు

కందుకూరు: ప్రజా సంక్షేమమే లక్ష్యమని ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. కందుకూరుకు చెందిన కొమ్మగళ్ల జ్యోతి అనారోగ్యంతో బాధపడుతూ, ఆస్పత్రిలో చికిత్స పొందడానికి డబ్బులు లేక ఇబ్బందులు పడుతుంది. ఈ విషయాన్ని ఎంపీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి ఎమ్మెల్యే సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.1.20లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. మంజూరైన ఎల్‌ఓసీని ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జ్యోతి కుటుంబీకులకు ఎమ్మెల్యే సబితారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆపదలో ఉన్న ప్రతీ ఒక్కరికి తన వంతు సహాయ సహకారాలు ఎళ్లప్పుడూ ఉంటుందన్నారు. నిత్యం ప్రజలకోసమే విధులు నిర్వహిస్తానన్నారు. నియోజక అభివృద్ధికి కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు తాళ్ల కార్తీక్, సోషల్ మీడియా కన్వీనర్ బొక్క దీక్షిత్‌రెడ్డి, బాలయ్య పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు



మధుయాష్కీతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

హుడాకాంప్లెక్స్: కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని నిజాయితీ, నిబద్ధతో పనిచేసిన ముఖ్య నేతలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని జిల్లా ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ క్యాంపెయినర్ కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌తో ఆయన మాట్లాడారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కూడా పార్టీ వీడలేదని, 40 సంవత్సరాలుగా పార్టీకి అండదండగా పనిచేసిన వారిని గుర్తించాలన్నారు. పార్టీలు మారినవారు పదవులు రాకపోతే వెళ్లిపోతారని, కొందరు పదవులు కాపాడుకోవడానికి పార్టీలో చేరుతారని, నిజమైన కార్యకర్తలు ఎళ్లప్పుడూ అండగా ఉంటారన్నారు. తమలాంటి వారు చాలా మంది పార్టీని నమ్ముకుని చాలా కాలం నుంచి ఉన్నారని చైర్మన్, డైరెక్టర్ పదవులనైనా కెటాయించాలని కోరారు.

క్లుప్తంగా

'విలీన ప్రతిపాదనను వెనక్కి తీసుకోండి'



మాట్లాడుతున్న నరేశ్ యాదవ్

పహాడీషరీఫ్: హైదరాబాద్ నగర శివారులోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను జీహెచ్‌ఎంసీలో విలీన ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని బీజేపీ బడంగ్‌పేట్ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు పెరమోని నరేష్ యాదవ్, యండీ నయీం, గుర్జని గణేశ్ గౌడ్‌లు డిమాండ్ చేశారు. మామిడిపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల నుంచి తికమక నిర్ణయాలు తీసుకుంటూ ప్రజలను అయోమయానికి గురి చేస్తుందన్నారు. శివార్లలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు జీహెచ్‌ఎంసీలో విలీనం చేసి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అస్తిత్వం లేకుండా ముఖ్యమంత్రి కుట్ర పన్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే కేఎల్లాఆర్, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిల మధ్య విభేదాలతో ఇలాంటి తప్పుడు నిర్ణయాలు వెలువడుతున్నాయన్నారు.

ఇసుక క్వారీల్లో అవినీతిపై చర్యలు చేపట్టాలి

మన్సూరాబాద్: ఇసుక క్వారీల్లో జరుగుతున్న అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సామాజిక తెలంగాణ ఫ్రంట్ చైర్మన్, హైకోర్టు అడ్వకేట్ వెన్నపూజ పరశరాజ్ అన్నారు. తెలంగాణ మైన్స్ అండ్ సాండ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆవిర్భావ సభ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వీ దామోదర్ అధ్యక్షతన హయత్‌నగర్ పరిధిలోని లెక్చరర్స్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెన్నపూజ పరశరాజ్ మాట్లాడుతూ, ఇసుక క్వారీల్లో ఎస్‌పీఓ, ఆర్‌ఓలు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ప్రైవేటు వ్యక్తుల ద్వారా లారీ డ్రైవర్లను బెదిరించి..లారీకి రూ.4500 చొప్పున వసూల్ చేస్తున్నారని ఆరోపించారు. లారీల్లో మైనింగ్ అధికారులే ఓవర్‌లోడ్ వేసి లారీలు క్వారీ నుంచి బయటకు రాగానే చలాన్లు వేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇసుక క్వారీల్లో పని చేస్తున్న మైనింగ్ అధికారులను వేరే శాఖకు బదిలీ చేసి, క్వారీల్లో ప్రత్యేక నిఘా అధికారులను ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ ఫైటర్స్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ తెప్పా అరుణ, సీహెచ్ యాదగిరి, స్వామిగౌడ్ ,వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

బక్రీద్‌కు ఏర్పాట్లు పూర్తి

కడ్తాల్: బక్రీద్ పండుగను ఘనంగా జరిపేందుకు ఆయా మజీద్ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. సోమవారం ఈద్గాల వద్ద ప్రత్యేక నమాజు కోసం ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలోని ఈద్గా వద్ద ఏర్పాట్లను మజీద్ కమిటీ అధ్యక్షుడు రవూఫ్, ఉపాధ్యక్షులు జావీద్ పర్యవేక్షించారు. ఉదయం 8.30 నిమిషాలకు ప్రత్యేక నమాజు ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు.. జహంగీర్‌అలీ, యూనుస్, యూసుఫ్, అనీస్, మోయిన్, అతీక్, షహబాజ్ తదితరులు ఉన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

కడ్తాల్: మండల పరిధిలోని మక్తమాధారం నుంచి నేదునూర్ వెళ్లే రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురై పాడైపోయింది. స్థానికులు సమస్యను మాజీ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ దృష్టికి తీసుకువెళ్లడంతో.. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆదివారం రోడ్డు మరమ్మతు పనులను ఆయన ప్రారంభించారు. నర్సింహ మాట్లాడుతూ.. మక్తమాధారం-నేదునూర్ రోడ్డును బీటీ రహదారిగా మార్చేందుకు కృషి చేస్తానని, సమస్యను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. నారాయణ, శాబుద్దీన్, నర్సింహ పాల్గొన్నారు.

నాయకుడిగా కాదు.. సేవకుడిగా పనిచేస్తా..

హయత్‌నగర్: తనపై నమ్మకంతో భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపిన మల్కాజిగిరి ప్రజలకు ఎప్పుడు రుణపడి ఉంటానని, వారికి నాయకుడిగా కాకుండా సేవకుడిగా పని చేస్తానని మల్కాజిగిరి ఎంపీగా విజయం సాధించిన ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ నాయకులు, డివిజన్ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఈటల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జీవితంలో మరిచి పోలేనంత గొప్ప విజయాన్ని ఇక్కడి ప్రజలు అందించారని, వారి ఆదరణను మరిచిపోలేనని అన్నారు. హయత్‌నగర్ డివిజన్ ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా స్థానిక కార్పొరేటర్ ద్వారా తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామరంగారెడ్డి, రాష్ట్ర నాయకులు కళ్లెం రవీందర్‌రెడ్డి , నాయకులు బండారి భాస్కర్, కోట రవీందర్, వెంకటేష్‌గౌడ్, పారంద మహేష్, సంఘి అశోక్ పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్ నాయకులతో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మహేశ్వరం: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మహేశ్వరం మండలం నాగిరెడ్డిపల్లి, నాగిరెడ్డిపల్లి తండాకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మిద్దే సుదర్శన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మాధవరాచిల ఆధ్వర్యంలో ఆదివారం ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. చేరిన వారిలో మిద్దే శివారెడ్డి, తూర్పాటి కృష్ణ, ఆంగోత్ కృష్ణనాయక్, ఆంగోత్ రాజేష్, దేవిజా, సాంటి నర్సింహ, కాట్రావత్ సోమనాథ్, కాట్రావత్ రమేష్, ప్రకాశ్, సేవల, మునావత్ రాములు, శ్రీను, జరుపుల శ్రీను, తుల్జా, నేనావత్ గోపాల్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండూరి మనోహర్, సిద్దు సురేందర్‌చారి, కాట్రావత్ కిషన్‌నాయక్, కడల పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా లోకల్ 57, వంకాయ 28, బెండ 60, పచ్చిమిర్చి 65, కాకర 55, బీర 75, క్యాలీఫ్లవర్23, క్యాబేజీ 23, క్యారెట్ 45. దొండ 40, ఆలు 33, ఉల్లి 39, గోకర 50, దోస 28, సొర 15, పొట్ల 18, అరటి 11, చిక్కుడు 65, అర్వి 40, మునగ 80, చిలగడదుంప 45, బీట్‌రూట్ 19, కీర 35, ఫ్రెంచ్ బీన్స్ 135, కాప్సికమ్ 70.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎల్‌బీనగర్: కాలనీలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు.డివిజన్ పరిధిలోని వీరాంజనేయ కాలనీ సంక్షేమ సంఘ నాయకులు ఆదివారం లచ్చిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ, కాలనీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రణాళిబద్ధంగా కాలనీలను అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు రామయ్య, ప్రధాన కార్యదర్శి సుధాకర్, సంయుక్త కార్యదర్శి రహీం, సభ్యులు భాష, శివ, శంకరయ్య, సత్యనారాయణరెడ్డి, బాబు పాల్గొన్నారు.

ది గ్రేట్ బాంబే సర్కస్ ప్రారంభం



సందడి చేస్తున్న జనం

మీర్‌పేట: రంగారెడ్డి జిల్లా మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడలో ప్రఖ్యాత ది గ్రేట్ బాంబే సర్కస్‌ను ప్రారంభించినట్లు నిర్వాహకులు కేఎం సంజయ్‌బాబు తెలిపారు. జిల్లెలగూడ పరిసర ప్రాంత ప్రజలను అలరించేందుకే సర్కస్‌ను ఏర్పాటు చేశామని, ప్రతిరోజు మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, తిరిగి రాత్రి 7 గంటల నుంచి ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు.

అన్ని వయస్సుల ప్రేక్షకులను ఆకట్టుకునేలా సెలవు రోజుల్లోనూ ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నామన్నారు. సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని భద్రతా చర్యలు పాటిస్తున్నామని చెప్పారు. ప్రజలు బాంబే సర్కస్‌ను చూసి తరించాలన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి

కడ్తాల్: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రానికి విచ్చేసిన వంశీచంద్‌రెడ్డికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కడ్తాల్ కాంగ్రెస్ కార్యాలయంలో.. పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షల మేరకు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగుతుందని తెలిపారు. ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఖచ్చితంగా అమలు చేస్తుందని.. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం శ్రమించిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేష్, నాయకులు.. లక్ష్మయ్య, మల్లేశ్‌గౌడ్, రామకృష్ణ, అశోక్, రాంచందర్‌నాయక్, మల్లయ్య, శేఖర్, శంకర్, బాలరాజు తదితరులు ఉన్నారు.

ధైర్యంగా ఉండండి..

అనారోగ్యానికి గురైన ఎస్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్ తండ్రి శంశుద్దీన్‌ను ఆయన ఇంట్లో ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు డాక్టర్ చల్లా వంశీచంద్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు జహంగీర్ అలీ, బాలరాజు, ఇక్బాల్, రాజేశ్, భానుకిరణ్ తదితరులు ఉన్నారు.

పేదల వైద్యానికి సీఎంఆర్‌ఎఫ్



సీఎం సహాయ నిధి ఎల్‌ఓసీ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: సీఎం సహాయనిధి పేద ప్రజలకు వరం లాంటిదని, వారి ఆరోగ్య పరిరక్షణకు, వైద్యానికి భరోసాగా నిలుస్తోందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని నందనవనం కాలనీలో నివాసముంటున్న రమణి మోకాళ్ల నొప్పులతో బాధపడుతోంది. ఆర్థిక పరిస్థితి బాగాలేక వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సంప్రదించారు. స్పందించిన ఆయన మహిళ ఆపరేషన్‌కు కావాల్సిన డబ్బుల వివరాలతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయించగా, లక్ష రూపాయల ఎల్‌ఓసీ చెక్కు మంజూరైంది. ఈ చెక్కును ఆదివారం బాధితురాలి సోదరుడు లింగంకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో చాతిరి మధుసాగర్, రాకేశ్‌ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ఉత్సవాలు

యాచారం: మండల పరిధిలోని చింతపట్లలో బొడ్రాయి పునఃప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభించారు. చైర్మన్ లిక్కి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్య లో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామస్తులు లక్ష్మారెడ్డి, మధుకర్‌రెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులు రైతులకు రుణాలివ్వాలి: సీపీఎం

యాచారం: వానాకాలం పంటల సాగు ఉధృతంగా సాగుతుందని రైతులు పెట్టుబడుల కోసం అప్పులు చేస్తున్నారని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ పేర్కొన్నారు. ఆదివారం యాచారంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా వ్యవసాయ పంటల రుణమాఫీ అమలు చేయడం లేదు. రైతులు బ్యాంకులకు వెళ్తే కొత్తగా అప్పులు ఇవ్వడం లేదని అన్నారు. రైతు భరోసా కూడా సకాలంలో జమ కాకపోవడంతో పెట్టుబడుల కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని బ్యాంకులు రైతులకు కొత్త రుణాలు ఇచ్చేలా ఆదేశాలివ్వాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కందుకూరు: మండలంలోని రాచులూరు జిల్లా పరిషత్ పాఠశాల 2004-05 (బ్యాచ్) పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం సీతారామశాస్త్రి ఫంక్షన్‌హాల్లో సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు, తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు అంజయ్య, కృష్ణ, నరసింహా, పాండురంగారెడ్డి, లక్ష్మీనారాయణ, లతా మంగేష్కర్, శ్రీదేవి, మల్లేష్‌లను సన్మానించారు. అనంతరం విద్యార్థులు వారి ఆశీస్సులను తీసుకున్నారు.

ఘనంగా ఫాదర్స్ డే

మొయినాబాద్‌రూరల్: ప్రపంచానికి మనల్ని చూపేది అమ్మ.. అయితే ప్రపంచాన్నే మనకు చూపేది నాన్న.. ఈ రోజు ఫాదర్స్ డే జరుపుకోవడం మనకు గర్వకారణమని యోగా సెంటర్ డైరెక్టర్ శ్రీనివాస్, మండల విశ్వకర్మ గౌరవ అధ్యక్షుడు నర్సింహ్మాచారిలు అన్నారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్, అమ్డాపూర్ గ్రామాల్లో ఫాదర్స్ డేను కుటుంబ సభ్యులతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అజీజ్‌నగర్‌లో యోగా కేంద్రంలో డైరెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తన కూతుళ్లు, వివిధ గ్రామాలకు చెందిన సభ్యులతో కలిసి కేక్‌కట్ చేసి స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. అమ్డాపూర్‌లో మండల విశ్వకర్మ గౌరవ అధ్యక్షుడు నర్సింహ్మాచారి ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులతో కలిసి ఫాదర్స్‌డే ఉత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో యోగా సెంటర్ చైర్మన్ భారతీ, సభ్యులు లక్ష్మీప్రసన్న, వివిధ గ్రామాల నాయకులు వెంకట్‌రెడ్డి, మణికంఠ, వీరచారి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డేమో ఇలా.. ప్రయాణం ఎలా?

- కంకర తేలిన జూపల్లి- చంద్రధన రోడ్డు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



జూలపల్లి నుంచి చంద్రధన వెళ్లే రహదారి దుస్థితి

తలకొండపల్లి: రోడ్డుపై మట్టి కొట్టుకుపోవడంతో పాటు కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని జూలపల్లి-చంద్రధన వెళ్తే రహదారి అధ్వానంగా మారింది. దాదాపు 4 కిలోమీటర్లున్న ఈ రోడ్డును రెండు దశాబ్దాల క్రితం నిర్మించారు. ఆనాటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డంతా గుంతలమయం అయ్యింది. ఎదురెదురు వాహనాలు వచ్చినప్పుడు అదుపుతప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. వర్షాకాంలో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి. కంకర తేలడంతో వాహనాలు త్వరగా మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైన ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని అవసరమైతే నూతన రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

కంకర తేలింది



జూలపల్లి-చంద్రధన వెళ్లే రోడ్డులో బీటీ ఎగిరిపోయి కంకర తేలి అధ్వానంగా మారింది. ఈ రోడ్డు నుంచి ప్రయాణించాలంటే భయపడాల్సిన పరిస్థితి. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు నిర్వహించాలి.

– నరేష్, చంద్రధన

ప్రమాదాలు జరుగుతున్నాయి



జూలపల్లి-చంద్రధన రోడ్డుపై గుంతలు పడిన విషయం మా దృష్టికి వచ్చింది. మరమ్మతులకు మంజూరైన నిధులతో వెంటనే పనులు చేపట్టాలి. లేదంటే నిధులు వెనక్కి మళ్లిపోయే ప్రమాదముంది. నిధులు వెనక్కి వెళ్లక ముందే మరమ్మతులు నిర్వహించాలి

– కుమార్, మాజీ సర్పంచ్, చంద్రధన

మరమ్మతులు చేయిస్తాం

జూలపల్లి-చంద్రధన రోడ్డుపై గుంతలు పడిన మాట మా దృష్టికి వచ్చింది. మరమ్మత్తుల కోసం రూ.కోటి35లక్షలు మంజూరయ్యాయి. ఇప్పటికే మరమ్మతు పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించాం. త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– విద్యాసాగర్, ఏఈ పీఆర్, తలకొండపల్లి